## క్లుప్తంగా

### ధర్మవరం రచయితకు లింగ్విస్టిక్ కన్నడ పట్టా

**ధర్మవరం:** పట్టణానికి చెందిన యువ రచయిత రామకృష్ణారెడ్డి మైసూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ నుంచి లింగ్విస్టిక్ కన్నడ పట్టా అందుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు లిట్ చేసిన తాను స్వతహాగా రచయిత కావడంతో ఇతర భాషల అధ్యయనం చేయడం వల్ల భాషా పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. కన్నడ భాషాధ్యయనం చేసినందుకు సెంట్రల్ గవర్నమెంట్ నుంచి రూ.80 వేలు స్టైఫండ్ పొందినట్లు పేర్కొన్నారు.

### 'రెడ్డి' విద్యార్థులకు నగదు బహుమతులు

**కదిరి:** డివిజన్ పరిధిలో ఇటీవల 10వ తరగతిలో మెరిట్ సాధించిన రెడ్డి సామాజిక వర్గ పేద విద్యార్థులకు తన సొంత నిధులతో నగదు బహుమతులు అందజేయనున్నట్లు రిటైర్డ్ ఎంఈఓ బి.వి.శివారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, జెడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన రెడ్డి సామాజిక వర్గం వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం ఈనెల 10వ తేదీలోగా విద్యార్థులు తమ ఫోన్ నంబర్‌తో పాటు టెన్త్, ఆధార్ జిరాక్స్ కాపీలను స్థానిక దత్త ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న తన స్వగృహంలో అందజేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారిలో ముగ్గురు మెరిట్ పేద విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం అమలును పరిశీలించారు. కేంద్రంలో 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల ఎత్తు, బరువు, రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారులకు సకాలంలో నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఎదిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి పాల్గొన్నారు.

### అయ్యప్పకు ప్రత్యేక పూజలు



ఆలయంలో హోమాలు చేస్తున్న అర్చకులు

**కదిరి టౌన్:** పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. గురుస్వామి తులసీస్వామి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా గురుస్వామి తులసీ స్వామి మాట్లాడుతూ.. సమస్త భక్తజనులపై ఎల్లవేళలా అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శంకరప్ప, కటికల రమేష్, భక్తులు పాల్గొన్నారు.

### ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని నల్లగుట్టతండా సమీపంలో ఉన్న మారెమ్మ గుడి విగ్రహ ప్రతిష్టకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్ శనివారం విరాళం అందజేశారు. రూ.10 వేలను ఆలయ కమిటీ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల కన్వీనర్ మణికంఠ నాయక్, సర్పంచ్ లక్ష్మీనాయక్, రామాంజి గోబరేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు కుటుంబాన్ని ఆదుకోండి

**బత్తలపల్లి:** అప్పులు, అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు, రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కురుబ పెద్ద మల్లేసు కుటుంబాన్ని పరామర్శించారు. అప్పులు ఇచ్చిన వారు ఇబ్బందులకు గురి చేయడం, ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడటంతో అవమానం భరించలేక పెద్ద మల్లేసు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, కోడేకండ్ల వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

# శిథిలమైన దోభీఘాట్

- దుస్తులు ఉతకాలంటే కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిందే
- నిరుపయోగంగా బోరు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రజకులు



తనకల్లు సమీపంలో పాచిపట్టిన నీటిలోనే బట్టలు ఉతుకుతున్న రజకులు

**తనకల్లు:** కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న రజకులు బట్టలు ఉతకడానికి నానాఅగచాట్లు పడుతున్నారు. కిలో మీటర్ల దూరంలోని పాపాగ్ని నది వద్దకు వెళ్లి బట్టలు ఉతికేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 750 వరకూ రజక కుటుంబాలు ఉన్నాయి. రజకుల సౌకర్యార్థం స్థానిక సుధా టాకీసు వెనుక 15 ఏళ్ల క్రితం దోభీఘాట్ నిర్మించారు. రెండు బోర్లను వేసి నీటి తొట్టెను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం నీటి తొట్టె పూర్తిగా పగిలిపోయింది. దోభీఘాట్ శిథిలావస్థకు చేరుకుంది. రెండు బోర్లలో ఒక బోరులో మోటారు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరో బోరులో నీరు అరకొరగా వస్తుండటంతో బట్టలు ఉతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్నట్లు రజకులు చెబుతున్నారు. దగ్గర్లోని చెరువులు, కాలువల్లో ఎక్కడా చుక్క నీరు లేకపోవడంతో బట్టలు ఉతకడానికి ఇబ్బందిగా మారింది. దోభీఘాట్ వద్దే అరకొరగా వస్తున్న నీటిని ఒక గుంతలో నిల్వ ఉంచి బట్టలు ఉతుకుతున్నట్లు తెలిపారు. అయితే గుంతలో నిల్వ ఉన్న నీరంతా పాచి పట్టడంతో పాటు దుర్గంధం వస్తోంది. పాచిపట్టిన నీటిలోనే బట్టలు ఉతకడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నట్లు వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దోభీఘాట్ వద్ద బట్టలు ఉతకలేక 10 కిలోమీటర్ల దూరంలోని పాపాగ్ని నది వద్దకు ఆటోలు, ఇతర వాహనాలను బాడుగకు తీసుకుని వెళ్తున్నారు. బట్టలకు ఉతుక్కొని తిరిగి వస్తున్నారు. బట్టలు ఉతకడం ద్వారా వచ్చే ఆదాయం ఆటోల బాడుగలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని దోభీఘాట్ వద్ద నీటితొట్టెలు, బట్టలు ఉతకడానికి బండలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్న బోరులో మోటారును ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. సమస్యలను అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దోభీఘాట్ వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### తొట్టెలను ఏర్పాటు చేయాలి



దోభీఘాట్ వద్ద నీటి తొట్టెలు, బట్టలు ఉతకడానికి అవసరమైన బండలను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న బోరు నుంచి నీరు చాలా తక్కువగా వస్తోంది. దీంతో మాకు బట్టలు ఉతకడానికి నీరు సరిపోవడం లేదు. నిరుపయోగంగా ఉన్న బోరులో మోటారు ఏర్పాటు చేస్తే నీటి సమస్య ఉండదు. అధికారులు వెంటనే మా సమస్యలను పరిష్కరించాలి.

– ఎగవిండ్ల నారాయణ, చాకలి వీధి, తనకల్లు

### సమస్యలు పరిష్కరిస్తాం



దోభీఘాట్ వద్ద నిరుపయోగంగా ఉన్న బోరులో మోటారును ఏర్పాటు చేస్తాం. అలాగే నీటితొట్టెలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి బట్టలు ఉతకడానికి అవసరమైన బండలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాం.

– కృష్ణమూర్తిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, తనకల్లు

### కులవృత్తిపైనే ఆధారపడి బతుకుతున్నాం



మా కుల వృత్తి అయిన బట్టలను ఉతికి వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వేసవి కాలం కావడంతో చట్టుపక్కల ఎక్కడా నీళ్లు లేవు. దీంతో చేసేది లేక పాపాగ్ని నదికి వెళ్లి బట్టలను ఉతుక్కుంటున్నాం. అధికారులు మా కష్టాలను అర్థం చేసుకుని దోభీఘాట్ వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– నాగలక్ష్మి, తనకల్లు

## ఏపీటీఎఫ్ ధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

**ధర్మవరం:** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేసి ఒక్కో పాఠశాలకు ఒక్కో రకంగా ఉపాధ్యాయులను నియమించడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి, బలరాముడు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సాయంత్రం ఏపీటీఎఫ్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5వ తేదీన తాలూకా కేంద్రాల్లో ధర్నా చేయనున్నామని పేర్కొన్నారు. 12వ పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు చేపట్టిన ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ఈశ్వరయ్య, బాలయ్య, నరసింహులు, వాసుకుమార్, జగదీష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న మురళీగౌడ్

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ఐటీఐ కళాశాలలో శనివారం ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మాజీ ఏఐవైఎఫ్ నాయకుడు మురళీగౌడ్ చేతులమీదుగా ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, తాలూకా కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఏఐవైఎఫ్ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. అనేక ఉద్యమాలు చేసి విద్యాభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రభుత్వం విద్యార్థులపై చిన్నచూపు చూస్తోందని వాపోయారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు లోకనాథ్, హరిప్రసాద్, మన్సూర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలసిన అనుబంధ సంఘాల నాయకులు

**పుట్టపర్తి టౌన్/అమడగూరు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇటీవల నియోజవర్గ మైనారిటీ అధ్యక్షుడిగా నియమితులైన సుభక్తుల్లా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన విజయభాస్కర్‌రెడ్డి, వలంటర్ విభాగం అధ్యక్షుడు నరేష్ యాదవ్, పుట్టపర్తి మన్సిపాలిటీ వింగ్ అధ్యక్షురాలు సాయిగీత తదితరులు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్యసాయి బాబా చిత్రపటం బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి అందరూ కలసికట్టుగా పని చేద్దామని తెలిపారు. అనంతరం ఎంపికైన వారు మాట్లాడుతూ.. నమ్మకం ఉంచి ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గణిగవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, కొత్తచెరువు మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, నాయకులు కొత్తకోట కేశప్ప, పాదయాత్ర శంకర్, రామాంజనేయులు, నూతన కన్వీనర్ తనకంటి జయప్ప, నాయకులు శేషూరెడ్డి, రమేష్, అన్సర్, ఉత్తప్ప, తబ్రేజ్, ప్యారూసాబ్, సయ్యద్ ఉస్మాన్, శ్రీనివాసులు, జిలాన్, మహబూబ్ బాషా, షబ్బీర్, షబ్బాజ్ తదితరులు పాల్గొన్నారు.



చేతులెత్తి మొక్కుతున్న సిహెచ్‌ఓలు

## అయ్యా.. కనికరించండి

- 6వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

**పుట్టపర్తి అర్బన్:** అయ్యా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ తమపై కరుణ చూపి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని సీహెచ్‌ఓలు చేతులెత్తి వేడుకున్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్‌ఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. జీతాలు, క్లినిక్ అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### వ్యక్తిపై రాయితో దాడి

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పార్థసారధినగర్ వద్ద ఉన్న మెకానిక్ షెడ్ వద్ద కణం మురళీని శనివారం సురేష్ అనే వ్యక్తి రాయి తీసుకుని నుదిటిపై దాడి చేశాడు. ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ దాడిలో మురళీకి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు సురేష్‌పై కేసు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

### రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

**కదిరి అర్బన్:** మండలంలో ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ అలాగే 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ పోలప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో ఆధార్‌కార్డు నమోదు, 0–6 సంవత్సరాలు దాటిన పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్‌కార్డు పొంది 5–15 సంవత్సరాలు పూర్తి అయిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలు అందిస్తారని పేర్కొన్నారు. 5న ముత్యాలచెరువు, 6న కాళసముద్రం, 7 న కొండమనాయునిపాళెం, 8న పట్నం, 12న కుమ్మరవాండ్లపల్లి–1 సచివాలయం, 13 తేదీల్లో కుమ్మరవాండ్లపల్లి–2 సచివాలయం, 14న కుమ్మరవాండ్లపల్లి–2 సచివాలయం, 15న కుమ్మరవాండ్లపల్లి–2 సచివాలయాల్లో ఉంటుందన్నారు.

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని కేతిరెడ్డి కాలనికి చెందిన గురుస్వామి శనివారం కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేశాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేతిరెడ్డి కాలనికి చెందిన గ్యాస్ డెలివరి బాయ్‌గా పనిచేసే గురుస్వామి కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది తన ఇంట్లోనే విష ద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్డీటీకి అండగా నిలుద్దాం



ఐక్యత చాటుతున్న యూటీఎఫ్ నాయకులు

**ధర్మవరం అర్బన్:** ఆర్డీటీ సంస్థకు ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో విద్య, వైద్యం, క్రీడలు, గృహ నిర్మాణాలు, వ్యవసాయ రంగంతోపాటు అనేక రంగాల్లో స్వచ్ఛంధ సేవలు అందిస్తూ ఆర్డీటీ అండగా నిలిచిందని తెలిపారు. ఆర్డీటీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సేవలందించిందని కొనియాడారు. ఉచిత విద్యకు తోడ్పాటునందిస్తూ ఎంతో మంది విద్యార్థులను గొప్ప స్థాయిలో నిలిపిందని గుర్తు చేశారు. కరోనా విపత్కర సమయంలో ఆర్డీటీ వైద్య సేవలు అందించి అనేక మంది ప్రాణాలను కాపాడిందన్నారు. క్రీడా రంగంలో అనేక క్రీడల్లో దేశస్థాయి క్రీడాకారులు తయారు చేశారన్నారు. చెక్ డ్యాంలు నిర్మించి సేంద్రియ ఎరువులను వాడటంలో రైతులకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలో భాగంగా ఆర్డీటీకి విదేశీ విరాళాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే పాలకపక్షాలు జోక్యం చేసుకుని ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, సురేష్, రాంప్రసాద్, రామంజనేయులు, వెంకట కిషోర్, మల్లికార్జున పాల్గొన్నారు.

### శభకార్యం

**ఓడీచెరువు:** మండల పరిధిలోని డబురువారిపల్లికి చెందిన ఎద్దుల రంగారెడ్డి కుమార్తె చందన, గోవర్ధన్ రెడ్డి వివాహ రిసెప్షన్ శనివారం జరిగింది. రిసెప్షన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, వెంకట రంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ జగన్ మోహన్ చౌదరి, శ్రీనివాస రెడ్డి, అశోక్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా శనివారం తాగునీటి కోసం బోరు వేయించారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నూతన బోరు వేయించడంతో నీరు సమృద్ధిగా పడ్డాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ నాయుడు, మాజీ సర్పంచ్ గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

### గాలివానకు నేలరాలిన మామిడి కాయలు

**ధర్మవరం రూరల్:** మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి, ఏలుకుంట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. ధర్మవరం మండలంలో అత్యధికంగా ఈ ప్రాంతంలో మామిడి తోటలను రైతులు సాగు చేసుకున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టడంతో ప్రస్తుతం పంట కోత దశకు చేరింది. ఇలాంటి సమయంలో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోవడంతో అపార నష్టం వాటిల్లిందని బాధిత రైతులు నారాయణరెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, గోవిందరెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

### వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**ఓడీచెరువు:** వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వాల్మీకి కులస్తుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేంత వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని పోస్టులో కూటమి ప్రభుత్వానికి పంపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, కృష్ణమూర్తి, మనోహర్, రాజశేఖర్, రామాంజి, హరిబాబు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం



బత్తలపల్లి: గంటాపురంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

**బత్తలపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎదుగుదల మెరుగుపడేలా కార్యకర్తలు, తల్లులు కృషి చేయాలని సీడీపీఓ సరస్వతి, సూపర్‌వైజర్ చంద్రమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోడేకండ్ల సెక్టార్ పరిధిలోని గంటాపురంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భవతుల సంరక్షణ, చిన్నారుల 1000 రోజుల సంరక్షణ, గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలకు రెండు సంవత్సరాలు వచ్చేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్డీటీ కమ్యూనిటీ హాల్‌లో తల్లులు, పిల్లలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గర్భవతులకు సీమంతం, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు.

**జేకే పల్లిలో పోషణ పక్వాడా**

**ముదిగుబ్బ:** మండల పరిధిలోని జేకేపల్లి సెక్టార్‌లోని జేకేపల్లి తండాలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ సరస్వతి, సూపర్‌వైజర్ లలితమ్మ మాట్లాడుతూ.. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు.

# 11న ఉచిత కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 11వ తేదీన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శనివారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి చూపును అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి చూపు తగ్గిన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు సుదర్శన్‌గుప్త, సత్రసాల ప్రసన్న కుమార్, శ్రీనివాసరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, కొండయ్య, నరేంద్రరెడ్డి, శివయ్య, దాత పిన్ను సురేష్‌బాబు, పెరుమాల్‌దాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

**కదిరి/కదిరి టౌన్:** ఏపీ పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో పెన్షనర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.శివారెడ్డి, ఆత్మారెడ్డి మాట్లాడుతూ.. కరువుకు మారుపేరైన కదిరి ప్రాంతంలో సర్కారు బడుల్లో చదివి అత్యధిక మార్కులు సాధించారంటే కచ్చితంగా భవిష్యత్‌లో వీరు ఐఏఎస్ లేదా ఐపీఎస్ సాధించడం ఖాయమన్నారు. పేదరికంలో ఉండి చదువుల్లో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంటర్‌లో 989 మార్కులు సాధించిన సంతోష్, టెన్త్‌లో 583 మార్కులు సాధించిన వర్షిక, భరత్ యాదవ్‌కు రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేసి సన్మానించారు.కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నాగభూషణం గౌడ్, పాల్గొన్నారు.

### ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

**తనకల్లు:** ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రెడ్డెప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్ పరిధిలో ఎనిమిది యూనిట్లు, ఎస్‌బీఐ పరిధిలో 10 యూనిట్లు, ఏపీజీబీ కింద మరో 9 యూనిట్లు మొత్తం కలిపి 27 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఒక కాపీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిత సమాచారం కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### నేడు ఏపీఆర్ఎస్‌లో ఇంటర్ ప్రవేశ పరీక్ష

**రామగిరి:** మండంలోని పేరూరు, నసనకోటలోని ఏపీ ఆర్ఎస్ (మహాత్మా జ్యోతి బా పూలే) పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు అమీనాబేగం, రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. నసనకోటలో 479 మంది, పేరూరుడ్యాంలోని పాఠశాల పరీక్ష కేంద్రంలో 299 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అన్ని సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నసనకోట పాఠశాలకు కేంద్రానికి చీఫ్‌గా రమాదేవిని, పేరూరు కేంద్రం చీఫ్‌గా మాధవిలతను నియమించినట్లు వారు వెల్లడించారు.